# అమ్మకం

"ఈ ఆడపిల్లల్ని అమ్ముకోడాలేమిటీ? ఇవి అమ్ముకోడాలు కాదు, దత్తతలు అనటమేమిటీ,

పేపరు తిరగేస్తూ, స్నేహితుడు కిరణ్‌తో అన్నాడు.

"అంత ఆశ్చర్యమేమిటీ - అమ్ముకోడాలు ఏమిటిదంతా - ఇందులోనూ ఏదో కుంభకోణ ముందిరా" సూర్యం అన్నాడు మనకేమైనా కొత్తా - నువ్వు చెప్పు మీ నాన్న మన ఊళ్ళో చెట్టు కొబ్బరికాయలన్నీ అమ్మేవాడు కాదూ, మా అమ్మ దొడ్లో కాసిన పొట్లకాయలు అమ్మేదికాదురా -" కాఫీ కప్పు క్రింద పెట్టాడు కిరణ్.

"ఛీ. నీకు కామన్‌సెన్స్ బొత్తిగా పోతోంది. దీనికి దానికీ ఏమైనా సంబంధం ఉందా - దేశాలే గగ్గోలయిపోతున్న పెద్ద. సమస్యని అంత తేలిగ్గా తీసిపారేస్తావేం" అన్నాడు సూర్యం కోపంగా.

"అవునురా, వాళ్ళ పిల్లలు, వాళ్ళకి డబ్బు కావాలి - వాళ్ళు అమ్ముకుంటారు - నీకేమిటీ" కిరణ్ కుర్చీలోంచి లేచాడు.

సూర్యం, కిరణ్ చిన్నప్పట్నుంచీ స్నేహితులు పెద్దవాళ్ళయి ఉద్యోగాలలో స్థిరపడ్డా భార్యాపిల్లల బాధ్యతలు పెరిగినా, స్నేహం మాత్రం చెక్కు చెదరకుండా అలాగే ఉంది.

వంటింట్లో పనిచేసుకుంటున్న సీత స్టౌ కట్టి చేతులు చీరకొంగుకి తుడుచుకుంటూ ముందు గదిలోకొచ్చింది. సన్నగా నాజూగ్గా ఉన్న సీత స్లీవ్‌లెస్ బ్లౌజు, పొట్టిజుట్టు, ఎంతో ఆకర్షణీయంగా ఉంది. క్లబ్బు మెంబరు, టెన్నిస్ ఆడుతుంది.

ఈమధ్యే సర్వీస్ క్లబ్ ప్రెసిడెంటు కూడా అయింది.

"మీరేమంటారు చెప్పండి" అన్నాడు కిరణ్ సీత వైపు చూస్తూ.

"అమ్మకాలు ఎప్పుడూ వున్నాయి. వుంటాయి - కనిపించేవి కొన్ని, కనిపించనివి కొన్ని" అంది గోళ్ళ పాలిష్ చూసుకుంటూ.

"అలా చెప్పండి బాగుంది..." కిరణ్ స్నానం చేయటానికి లోపలకెళ్ళాడు.

"మీకెన్నిసార్లు చెప్పాను... తగాదా విషయాలు మాట్లాడవద్దని... నిన్న నేను మన పనిమనిషి" ఏదో అనబోయింది సీత. అంతలో కిరణ్ లోపలికొచ్చి.

"ఓ పూట స్నానం చేయకపోతే ఏం కొంపమునుగుతుంది - అసలే నీళ్ళ కరువూ - ముఖం కడుక్కోవచ్చుగా" అన్నాడు టవల్‌తో ముఖం తుడుచుకుంటూ.

సూర్యం, కిరణ్ బయటపనులున్నాయని వెళ్ళిపోయారు. సునీత బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ నిద్రలేచింది.

"మమ్మీ, ఆ అంకుల్. వెళ్ళిపోయారా, అంత పెద్ద గొంతుతో మాట్లాడుతారో – ఛీ నా నిద్ర డిస్ట్రబ్ అయిపోయింది." అంది ఆవులిస్తూ సునీత.

పాపం లేదు పుణ్యం లేదు ఎవరి వ్యాపారం వాళ్ళది అంది "అయ్యో! ఇంత చిన్న పిల్లల్నా పాపం" అంది పేపరు చూస్తూ సునీత.

కానీ సీత గుండెల్లో బాధ ఎలా చెప్తుందీ, ఎవరికి చెప్తుందీ!!

తన బాల్యం కళ్ళముందు నిల్చింది సీతకి. చిన్న పెంకుటింటి ముందర బంతిపూల మొక్కలు... తను అప్పటికి మూడో సంతానం రామయ్యకి, కమలమ్మకి... రోజూ ఓ కారు తమ చిన్న ఇంటికి దూరంగా ఆగేది. ఓ మధ్య వయసాయన లోపలకొచ్చేవాడు. కుక్కి మంచం మీద కూచునేవాడు. అమ్మ టీకాచి గాజు గ్లాసులో పోసి తెచ్చి ఇచ్చేది. ఆయన కొంచెం సేపు కూచుని వెళ్ళిపోయేవాడు. ఆయన అటు వెళ్ళగానే అమ్మ. శాపనార్థాలు పెట్టేది... నాన్న అమ్మని బతిమాలేవాడు... ఎందుకో, ఏమిటో అర్థంకాక అమ్మ ముఖం చూసేది తను!!

ఓ రోజు ఆ కారు ఇంటిముందు ఆగగానే, అమ్మ తనని కార్లో ఎక్కించింది... అమ్మ కూడా కార్లో కూచుంది.

"ఎక్కడికి" అంది భయంగా సీత. "మామయ్య ఊరికి" అంది తల్లి. కారు వేగంగా కదిలిపోయింది... కార్లో నిద్రపోయింది సీత.

తెల్లారేసరికి పెద్ద భవనం ముందు కారు ఆగింది. కానీ కార్లోవచ్చిన తన తల్లి ఏదీ! – సీత భయం భయంగా అటు ఇటూ చూసింది.

"రా, పాపా, భయం లేదు" అంది ఓ నలభై ఏళ్ళావిడా. ఏమీ అర్థం కాని సీత గొల్లున ఏడ్చింది...

ఆ తర్వాత మీ అమ్మ రేపొస్తుంది, ఎల్లుండి వస్తుంది అనేది ఆవిడ. ఆవిడతోబాటు సీతని తన పక్కలో పడుకోపెట్టుకోసాగింది –

ఏమిటిదంతా, జయలక్ష్మమ్మగారికి తరగని ఆస్తి, పిల్లలు లేరు. బంధువుల్లో పిల్లల్ని పెంచుకోటం ఇష్టం లేదు. ఈ కారు మామయ్య ఆవిడ తమ్ముడే – అతని కొడుక్కి సీతని కట్టబెట్టి ఆస్తిపోనీకుండా చూడటం కారు మామయ్య లక్ష్యం!

సీత రహస్యంగా అమ్మకోసం ఏడ్చేది. పెద్ద పట్టు పరికిణీ కట్టుకుని, మెడలో బంగారు గొలుసు వేసుకున్నప్పుడు సీతకి సంతోషం వచ్చేదికాదు, దుఃఖమొచ్చేది, తన అక్కలిద్దరూ పాత పరికిణీలు కట్టుకుని, అమ్మ వెనకాల పనులు చేస్తుంటే తనకీ భాగ్యమా!!

ఆ రోజు సీత వెక్కివెక్కి ఏడుస్తోంది. "ఎందుకే సీతా" అంది జయలక్ష్మమ్మగారు బుజ్జగిస్తూ.

'వెళ్ళిపోతా అమ్మదగ్గరికి" వెక్కి వెక్కి ఏడ్చింది సీత.

"ఇవాళ నిన్ను మంచి ఇంగ్లీషు స్కూలులో చేర్పిస్తా. అక్కడ పిల్లలందరూ ఇంగ్లీష్ మాట్లాడుతారు - దాంట్లో చేర్పిస్తే చక్కగా కారులో స్కూలుకి పంపిస్తా... ఏడవకు - మీ చిన్న ఇల్లు మొన్న వర్షాలకి పడిపోయింది.

"అయ్యో, అమ్మ" -

"మీ అమ్మని, నాన్నని, అక్కల్ని కారుమామయ్య వాళ్ళ ఇంట్లోనే వెనకింట్లో ఉంచాడు. నువ్వెందుకేడుస్తావ్... మీ అమ్మని రమ్మని రాస్తాలే" అంది.

ఆ మాట ఎంతో ఆనందాన్నిచ్చింది సీతకి. ఎప్పుడొస్తుంది మా అమ్మ అనేది రోజూ... రేపు రేపు అనేది జయలక్ష్మమ్మగారు.

ఓ రోజు జయలక్ష్మమ్మగారికి చాలా చిరాకొచ్చింది. ఎప్పుడూ ఏడుపేమిటి? ఇంటికి దరిద్రం"

"నిన్ను ఊరికే తెచ్చుకోలేదు - కొనుక్కున్నాం తెలుసా" అంది గబుక్కున.

"కొనుక్కున్నారా?" సీతకి నోట మాట రాలేదు.

"మరి, లేకపోతే మీ అమ్మ ఊరికే ఇచ్చిందా నిన్ను, మాకు అమ్మేసింది. నువ్వక్కడ కెళ్ళాలంటే మొత్తం మే మిచ్చిన డబ్బంతా మాకివ్వాలి. ఇస్తుందా, ఎక్కడనించి తెచ్చి ఇస్తుందీ!" జయలక్ష్మమ్మగారు గొంతు చించుకు అరుస్తోంది.

సీత నోట మాట రాలేదు - అమ్మా నాన్నా తనని వీళ్ళకి అమ్మేశారా - డబ్బు కోసం అమ్మేశారా - సీతకి కన్నీళ్ళే కాదు. అమ్మా నాన్నల మీద అసహ్యం కోపం గొంతు దాకా వచ్చాయి.

అంతే, ఆ తర్వాత సీత ఒక్కసారి కూడా అమ్మ గురించి పైకి అనలేదు.

జయలక్ష్మమ్మగారి పెంపకంలో మంచి స్కూలు, మంచి భోజనం మంచి స్థాయి వచ్చేశాయి సీతకి.

కాలం గిర్రున తిరిగింది..... కారు మామయ్య

అనుకున్నట్లుగా సీతపెళ్లి ఆ మామయ్య కొడుకుతో జరగలేదు. ప్రేమించిన సూర్యంతో జరిగింది.

సీత గతాన్ని తల్చుకుని ఓ నిట్టూర్పు విడిచింది.

"మమ్మీ - నువ్వు అంత నిట్టూర్పులు విడవక్కర్లేదు - డబ్బు లేని దిక్కుమాలిన అమ్మనాన్నలు అమ్ముకుంటారు. డబ్బునవాళ్ళు కొనుక్కుంటారు - అంతే" అంది సునీత. సీత నిట్టూర్పు విని - ఎందుకు నిట్టూర్చిందో తెలియక - పేపరు విషయమే అనుకుని, "అంతే , అంతేలే" అంది నవ్వి.

సునీత ఇంజనీరింగ్ పాసయిపోయింది. ఎలాగైనా పిల్లని అమెరికా పంపేయాలన్నదే తల్లీ తండ్రి ఆలోచన. సునీతకి అమెరికా వెళ్ళటం ఇష్టమే లేదు. కానీ, అమ్మా నాన్నల బలవంతంతో అమెరికా వెళ్ళిపోయిన సునీత ఒక్కరోజు కూడా ఆనందంగా లేదు.

"అమ్మాయి అమెరికాలో ఉంది, బోల్డు డాలర్లు సంపాదిస్తుంది... మంచి ఫ్లాటు కొనుక్కుందాం" అంది సీత. "ఊ" అన్నాడు సూర్యం. నిజానికి సునీతని అంతదూరం పంపేయటం సూర్యానికి ఇష్టం లేదు.

సీత తన చిన్నప్పటి రోజులు తల్చుకోటం పూర్తిగా మానేసింది. అంతేకాదు, ఎవరి అదృష్టం వాళ్ళది అనే గట్టి నమ్మకం మనసులో నింపుకుంది. రేపు సునీత అమెరికానుంచి డబ్బులుపంపితే, మంచి కారు కొనుక్కుంటా... డ్రైవింగ్ నేర్చుకుంటా – ఎవరదృష్టం వాళ్ళదీ అనుకుంది మనసులో.

ఫోను మ్రోగింది. సూర్యం పదినిముషాలు పైగా మాట్లాడాడు. తనైతే మూడు నిముషాలే మాట్లాడుతాడు. ఎంతసేపయినా మాట్లాడండి డాడీ అంటోంది అమ్మాయి.

వంటింట్లోంచి సీత వచ్చేసరికి ఫోను పెట్టేశాడు సూర్యం. కట్ అయింది అన్నాడు భార్య వంక చూస్తూ

"ఏమంటుందీ అంది జుట్టు రబ్బరు బాండ్ సరిచేసుకుంటూ" సీత.

సూర్యం మాట్లాడలేదు. "మిమ్మల్నే" అంది మళ్ళీ.

"చెప్తా... నువ్వు బాధపడతావు".

"అంటే?"

"అంటే ఆ అమెరికా ఉద్యోగం నచ్చలేదుట. అక్కడ దానికి ఏమీ నచ్చలేదుట – చాలా చిరాగ్గా ఉందిట – డ్రైవింగ్ స్కూల్లో చేరినా ఇంకా కారునడిపే ధైర్యం రావటం లేదట" –

"అబ్బ – ఏమిటీ, అన్నీ నెగిటీవేనా – ఇంత మంది ఉత్సాహంగా ఆ దేశంలో ఉంటుంటే దీనికేమొచ్చింది – కష్టపడి నాలుగు డబ్బులు సంపాదించుకుని ఓ పదేళ్ళుంటే. అప్పుడు ఇక్కడ కొచ్చి సుఖపడచ్చు" అంది సీత కోపంగా.

"సుఖమా?" సూర్యం ఫక్కున నవ్వాడు.

"పదేళ్ళక్కడుండటమా" మళ్ళీ నవ్వాడు. సీత ముఖం కోపంతో కంది పోయింది.

వారం రోజులయ్యాక సూర్యానికి ఓ పెద్ద ఉత్తరం వచ్చింది సునీత దగ్గరనుంచి. మొదటి నుంచీ సునీతకి తల్లి దగ్గర కన్నా తండ్రి దగ్గరే చనువు.

ఆ పెద్ద ఉత్తరం మళ్ళీ మళ్ళీ శ్రద్ధగా చదివాడు సూర్యం. ఈ ఉత్తరం చదివితే అమ్మ బాధపడుతుంది డాడీ, కానీ నా మనసులో బాధ ఎవరికి చెప్తానూ - అమ్మకి కోపం వస్తే రానీ - సునీత ఉత్తరం భార్యకి చూపించాలా వద్దా అని చాలా ఆలోచించాడు. అంతేకాదు, కారు మామయ్య ఎంత దుష్టుడో మరోసారి అర్థమయింది సూర్యానికి.

"అయిందా చదవటం, నా కూతురు రాసిన ఉత్తరం నన్ను చదవనీయరా... నన్ను మాట్లాడనీయకుండా ఆరోజు ఫోను పెట్టేశారు - "సీత సూర్యం చేతిలో ఉత్తరం లాక్కుంది.

అక్షరాలు కదిలిపోతున్నాయి... సీత ముఖం ఎర్రబడుతోంది - ఆ రోజు కిరణ్ మామయ్యతో పిల్లల్ని అమ్ముకోటం గురించి అమ్మ ఎందుకంత ఆవేశంగా మాట్లాడిందో అప్పుడర్థం కాలేదు - డాడీ. ఆ మధ్య నాకు అమెరికా వచ్చే ముందు కారు మామయ్య కలిశాడు - నిజం డాడీ, జీవితము వ్యాపారము రెంటికీ అవినాభావ సంబంధముంది - డాడీ, ఇంత పెద్ద పెద్ద విషయాలు రాస్తున్నందుకు ఏమీ అనుకోకండి - మీరు నిజం చెప్పండి, అమ్మ నన్ను అమ్మేయలేదూ - అమెరికా ఉద్యోగానికి అమ్మేయలేదూ - ఖచ్చితంగా నన్ను అమ్మేసింది... మరి ఆనాడు వాళ్ళమ్మ తనని జయలక్ష్మమ్మగారికి అమ్మేస్తే తప్పేమిటి!! - ఎప్పుడూ ఉన్నాయి అమ్ముకోటాలు!!

బహుశా ఈ ఉత్తరం చేరకుండానే, నేను మనింటికొచ్చేసినా ఆశ్చర్యపోకండి - ఉత్తరంలో అక్షరం అక్షరం తనని గుచ్చుతోందనీ అనిపించిన సీత ముఖం వెలవెల పోయింది.

"అదీ అక్కర్లేదు, దాని డబ్బూ అక్కర్లేదు చెప్పండి మీ ముద్దుల కూతురికి" ఉత్తరం భర్త ముఖాన విసిరి కొట్టింది సీత.

"సీతా, అది మన పిల్లే - దాని ఆవేదన ఎవరికి చెప్తుంది - దాని మాటా నిజమేనేమో!! దానికిష్టం లేని పని దాని చేత మనం చేయిస్తున్నాం - అవునా" భార్యని బుజ్జగిస్తూ అన్నాడు సూర్యం.

అవసరానికి ఏ తల్లి అయినా పిల్లల్ని అమ్ముకుంటుదేమో! ఏమో! మా అమ్మ నన్ను అమ్మింది - నిజం - కానీ, నేను నిన్ను అమ్మానా? - రెండూ ఒకటే అంటావా!! - సీత తనలో తను మాట్లాడుకుంటుంటే, చిన్న పెంకుటిల్లు, తల్లి తండ్రి, అక్కలు ఒకసారి కళ్ళ ముందు నిల్చి "ఆ ఇదీ అంతే" అని తనని చూసి నవ్వినట్టనిపించింది. సీతకి.

"ఇదీ అలాంటిదేనా" - భర్త కౌగిటిలో ఒదిగిపోయి కన్నీళ్ళలో మునిగిపోయింది సీత ఆ రాత్రి.

- ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రిక 16 జనవరి 2002